తెలంగాణ TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 09 - సెప్టెంబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 97 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద ఉద్రిక్తత

- ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్, దళిత సంఘాల యత్నం
- భారీగా మోహరించిన పోలీసులు
- కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతల అరెస్ట్
- డప్పుల మోతతో నిరసన తెలిపిన కాంగ్రెస్ శ్రేణులు



ఎర్రవల్లి, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు)

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చిన నేపథ్యంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెయ్యి మంది డప్పు కళాకారులతో నిరసన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ పిలుపునివ్వడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫామ్‌హౌస్ వైపు వెళ్తున్న నిరసనకారులను మార్గమధ్యంలోనే అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. దళితులను అవమానించారనే ఆరోపణలపై బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.

మిగతా 2లో..

# హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం

- అసెంబ్లీలో భావోద్వేగానికి గురైన స్పీకర్
- "అన్నది నా తల్లిని, మీ తల్లిని కాదు" అంటూ వ్యాఖ్య
- మహిళా ఎమ్మెల్యేల ఘటనపై నివేదిక కోరినట్లు వెల్లడి
- నివేదిక వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ



హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ అసెంబ్లీలో సోమవారం చోటుచేసుకున్న పరిణామాలపై చర్చ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ భావోద్వేగానికి గురయ్యారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ, తన తల్లిపై చేసిన వ్యాఖ్యలు తనను తీవ్రంగా బాధించాయని పేర్కొన్నారు. "అన్నది నా తల్లిని, మీ తల్లిని కాదు" అంటూ స్పీకర్ చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశంగా మారాయి. అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేల పట్ల జరిగిన వ్యవహారంపై హరీశ్‌రావు స్పందిస్తూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిపై జరిగిన ఘటనలపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ముగ్గురు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేశారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సమాధానంగా మాట్లాడిన స్పీకర్ ప్రసాద్ కుమార్,

మిగతా 2లో..

# కేబినెట్ శాఖల మార్పుపై టీపీసీసీ వివరణ

తెలంగాణ రాజకీయాల్లో చర్చ..

- మంత్రుల శాఖల పునర్వ్యవస్థీకరణపై హైకమాండ్‌కు సూచనలు
- తుది నిర్ణయం సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానానిదేనన్న టీపీసీసీ చీఫ్
- మంత్రి పదవిపై స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్
- కేబినెట్ విస్తరణ ఊహాగానాల మధ్య కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు కొనసాగుతున్న వేళ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మంత్రులకు కేటాయించిన శాఖలను సమగ్రంగా పునర్వ్యవస్థీకరించి కొత్తగా బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానానికి తన సూచనలను తెలియజేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తన అభిప్రాయాన్ని హైకమాండ్‌కు తెలియజేశానని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అయితే శాఖల మార్పులు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలపై తుది నిర్ణయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగేందుకు అవసరమైన సూచనలు మాత్రమే చేశానని తెలిపారు. ఇటీవల కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడం, పలు కీలక పదవుల్లో మార్పులు చోటుచేసుకోవడం, ఖాళీగా ఉన్న మంత్రి పదవుల భర్తీపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో

మిగతా 2లో..

# రేవంత్ రెడ్డికి పాడి కౌశిక్ రెడ్డి సవాల్

- కొడంగల్‌లో రాజీనామా చేసి పోటీ చేయాలంటూ ఛాలెంజ్
- ముఖ్యమంత్రికి బహిరంగ సవాల్ విసిరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే
- హుజూరాబాద్‌లో తాను కూడా రాజీనామా చేస్తానన్న కౌశిక్
- అసెంబ్లీలో సీఎం భాషపై తీవ్ర విమర్శలు
- కడియం శ్రీహరిపై ఘాటు వ్యాఖ్యలు





హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. కొడంగల్ శాసనసభ స్థానానికి ముఖ్యమంత్రి రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. తాను కూడా హుజూరాబాద్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన కౌశిక్ రెడ్డి, ఉపఎన్నికల్లో రేవంత్ రెడ్డి డిపాజిట్ సాధిస్తే సభ సాక్షిగా ముక్కు నేలకు రాస్తానంటూ సవాల్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద

మిగతా 2లో..

తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై

# సస్పెన్షన్ వేటు

- సమావేశాల కాలం మొత్తం సస్పెండ్ చేసిన మండలి ఛైర్మన్
- స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో చర్యలు
- తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ
- రాజ్యాంగబద్ధ పదవుల గౌరవం కాపాడాలని స్పష్టం





హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ప్రస్తుత సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఈ అంశంపై అధికార కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ స్పీకర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం, శాసనసభ ప్రాంగణంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ప్రవర్తనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో ప్రత్యేక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

తీర్మానంపై మాట్లాడిన మంత్రి దామోదర రాజనర్సింహ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. దానిని ఒక వర్గానికి మాత్రమే పరిమితం చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, అయితే రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్య సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని చెప్పారు. స్పీకర్ పదవి ఏ కులానికో, మతానికో చెందినది కాదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే చర్యగా అభివర్ణించారు. అధికారాన్ని కోల్పోయిన తర్వాత కూడా బీఆర్ఎస్ నాయకుల వైఖరిలో మార్పు కనిపించడం లేదని మంత్రి విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ మాటలు, ప్రవర్తనలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా ఈ అంశంపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశంగా మారాయి. మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి

మిగతా 2లో..

అసెంబ్లీ ఘటనపై హైకోర్టులో

# వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

- మధ్యంతర ఉత్తర్వుల సవరణ కోరిన ప్రభుత్వ పిటిషన్‌పై విచారణ
- ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు
- మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల వ్యవహారంపై ప్రశ్నలు
- స్పీకర్ అధికారాలు, పోలీసుల చర్యలపై కోర్టులో విస్తృత చర్చ

హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ అసెంబ్లీ వెలుపల ఇటీవల చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో విస్తృతంగా




మిగతా 2లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

గజ్వేల్ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు ఎర్రవల్లికి చేరుకున్నారు. వరదరాజాపూర్ మీదుగా ఫామ్‌హౌస్ సమీపానికి చేరుకున్న వారిని పోలీసులు నిలువరించారు.
పోలీసుల అడ్డుకోవడంతో నిరసనకారులు డప్పుల మోతతో ఆందోళన చేపట్టారు. బారికేడ్లను తొలగించి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని వెనక్కి నెట్టారు. ఈ క్రమంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు చర్యలు చేపట్టగా కొందరు పోలీసు సిబ్బందికి స్వల్ప గాయాలు అయినట్లు సమాచారం. ఫామ్‌హౌస్ సమీపంలో సుమారు రెండున్నర గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహా పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఫామ్‌హౌస్ పరిసరాల్లో భారీ సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించారు.
ఇదే సమయంలో అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయలుదేరిన బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు హకీంపేట వద్ద అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను ప్రోత్సహిస్తూ పోలీసులే వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అనంతరం కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల అంశం కూడా రాజకీయంగా దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం కొనసాగుతోంది. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీలు డిమాండ్ చేయగా, బీఆర్ఎస్ మాత్రం తమ పార్టీపై రాజకీయ కక్ష సాధింపే జరుగుతోందని ఆరోపిస్తోంది.

# కేబినెట్ శాఖల మార్పుపై టీపీసీసీ వివరణ

(మొదటి పేజీ తరువాయి)

కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు అవకాశం ఉందన్న ప్రచారం కూడా కొనసాగుతోంది. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలపై వస్తున్న ప్రచారంపై స్పందించిన మహేశ్ కుమార్ గౌడ్, ఆ విషయాన్ని పూర్తిగా పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని చెప్పారు. ప్రస్తుతం తన ప్రధాన బాధ్యత పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమేనని, పీసీసీ అధ్యక్షుడిగా సంస్థాగత నిర్మాణంపై పూర్తి దృష్టి సారిస్తున్నానని తెలిపారు.
అయితే గత కొద్ది రోజులుగా కేబినెట్ విస్తరణపై భిన్నమైన వార్తలు వెలువడుతున్నాయి. కొందరు నేతలు విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని చెబుతుండగా, మరికొన్ని రాజకీయ వర్గాలు ఈ నెలాఖరులోగా శాఖల మార్పులు, కొత్త మంత్రుల ఎంపిక ఉండవచ్చని అంచనా వేస్తున్నాయి. దీంతో కాంగ్రెస్‌లో అంతర్గతంగా ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది. మహేశ్ కుమార్ గౌడ్ తాజా వ్యాఖ్యలతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై మరోసారి దృష్టి కేంద్రీకృతమైంది. మంత్రుల శాఖల్లో మార్పులు జరుగుతాయా, ఖాళీ స్థానాలు భర్తీ అవుతాయా, పార్టీ సామాజిక సమీకరణాలకు అనుగుణంగా కొత్త ముఖాలకు అవకాశం లభిస్తుందా అనే అంశాలపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. తుది నిర్ణయం కాంగ్రెస్ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల్లోనే ఉండటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం మరికొంతకాలం చర్చనీయాంశంగా కొనసాగే అవకాశముంది.

# హరీశ్‌రావుపై స్పీకర్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

మహిళా సభ్యులంటే సభకు మాత్రమే కాకుండా తనకు కూడా ఎంతో గౌరవమని స్పష్టం చేశారు. తాను మాట్లాడుతున్న సమయంలో అనవసర ఆవేశానికి గురి కావద్దని హరీశ్‌రావుకు సూచించారు. పరిస్థితులను అర్థం చేసుకుని వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా స్పీకర్ భావోద్వేగంతో మాట్లాడుతూ, "మీకు కాదు ఆవేశం నాకు ఉండాలి. మీ తల్లిని అనలేదు, నా తల్లిని అన్నారు" అని వ్యాఖ్యానించారు. సభలో గౌరవం, మర్యాదలు పాటించాల్సిన అవసరం ఉందని సభ్యులకు గుర్తుచేశారు.
బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మిపై తనకు పూర్తి గౌరవం ఉందని స్పీకర్ తెలిపారు. వారికి జరిగిన అసౌకర్యంపై నివేదిక ఇవ్వాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. నివేదిక అందిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అసెంబ్లీలో జరిగిన ఈ పరిణామాలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదాల నడుమ స్పీకర్ చేసిన భావోద్వేగ వ్యాఖ్యలు సభలో ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మహిళా ఎమ్మెల్యేల ఘటనపై నివేదిక అనంతరం తదుపరి చర్యలు ఉండనున్నాయి.

# రేవంత్ రెడ్డికి పాడి కౌశిక్ రెడ్డి సవాల్

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఉపయోగించిన భాష, పదజాలం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ఉందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. శాసనసభ వంటి అత్యున్నత వేదికపై ప్రతిపక్ష సభ్యులను గౌరవించకుండా మాట్లాడటం సరికాదన్నారు. తెలంగాణ సమాజమంతా ముఖ్యమంత్రి వ్యవహారశైలిని గమనిస్తోందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధుల మధ్య పరస్పర గౌరవం ఉండాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై కూడా కౌశిక్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలోనే ప్రతిపక్ష నేతలను బెదిరించే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలను పట్టించుకోకుండా కేవలం బీఆర్ఎస్ సభ్యులపైనే చర్యల పేరుతో హెచ్చరికలు జారీ చేయడం అన్యాయమని అన్నారు. అధికార పార్టీ నేతల ప్రవర్తనపై కూడా సమానంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పార్టీ ఫిరాయింపుల అంశాన్ని ప్రస్తావిస్తూ కడియం శ్రీహరిపై కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నో పదవులు అనుభవించిన వ్యక్తి ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేయడం ఆశ్చర్యకరమన్నారు. పార్టీ బీ ఫారమ్‌పై గెలిచి తరువాత కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరికి నైతిక విలువల గురించి మాట్లాడే అర్హత లేదని వ్యాఖ్యానించారు. డిప్యూటీ ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ, ఎంపీ వంటి కీలక పదవులు చేపట్టిన సమయంలో కడియం శ్రీహరికి నైతికత గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారిన నేతలు ఇప్పుడు బీఆర్ఎస్‌కు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తల్లిలాంటి పార్టీని వీడి వెళ్లిన వారు పార్టీ విధేయత గురించి మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతోంది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో పాడి కౌశిక్ రెడ్డి చేసిన సవాళ్లు, వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# వీసా మోసం కేసులో యూట్యూబర్ రమానందనకు చిక్కులు

- **ఇబ్రహీంపట్నం పోలీసుల విచారణకు హాజరు**
- **రూ.13 లక్షలు వసూలు చేసి మోసం చేశారన్న ఆరోపణలు**
- **అద్దంకిలోనూ మరో వీసా స్కామ్ కేసు నమోదు**



**హైదరాబాద్/ప్రకాశం జిల్లా, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):** విదేశాల్లో ఉద్యోగాలు, వీసాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేశారన్న ఆరోపణలతో ప్రముఖ యూట్యూబర్ రమానందన వివాదంలో చిక్కుకున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నమోదైన వీసా చీటింగ్ కేసులో ఆమె మంగళవారం తన న్యాయవాదులతో కలిసి పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించగా, ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బాధితుడు క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమానందన దంపతులు విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చి తన వద్ద నుంచి రూ.13 లక్షలు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. అయితే చెప్పినట్లుగా ఉద్యోగం కల్పించకపోవడంతో పాటు డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.
ఈ కేసు విచారణలో భాగంగా యూకే నుంచి హైదరాబాద్‌కు వచ్చిన వెంటనే పోలీసుల ఎదుట హాజరుకావాలని రమానందనకు నోటీసులు జారీ చేశారు. నోటీసుల మేరకు ఆమె ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణలో పాల్గొన్నారు. కేసుకు సంబంధించిన పలు అంశాలపై అధికారులు ప్రశ్నలు అడిగి వివరణ తీసుకున్నట్లు సమాచారం. విచారణ అనంతరం పోలీసులు మరిన్ని ఆధారాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కూడా రమానందనపై మరో కేసు నమోదు కావడం సంచలనంగా మారింది. 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరుతో వీసా రెన్యువల్, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి 2023లో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారని పలువురు బాధితులు ఆరోపించారు. ఈ మేరకు అద్దంకి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వరుస కేసులు నమోదవుతుండటంతో మరికొంత మంది బాధితులు కూడా ముందుకు వస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన బాధితులు తమ ఫిర్యాదులను నమోదు చేసేందుకు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. బాధితుల వాంగ్మూలాలను నమోదు చేస్తున్న పోలీసులు కేసుల మధ్య ఉన్న సంబంధాలను కూడా పరిశీలిస్తున్నారు. రమానందనపై నమోదైన ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విదేశీ ఉద్యోగాలు, వీసాల పేరుతో జరిగిన లావాదేవీలు, కన్సల్టెన్సీ కార్యకలాపాలు, బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తాలపై అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. విచారణలో లభించే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం: కలెక్టర్

- **పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం**

**ములుగు, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):** యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరంలో మంగళవారం పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలపై చర్చించారు. వెంకటాపూర్ మండల పరిధిలో ప్రతిపాదిత ఓపెన్‌కాస్ట్ మైనింగ్ కార్యకలాపాల వల్ల కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) దేవాలయానికి ఎలాంటి ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. మైనింగ్ ప్రాజెక్టుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాన్ని కూడా కమిటీ పరిశీలించింది. సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. పర్యావరణ పరిరక్షణ, వారసత్వ సంపద సంరక్షణ, భద్రతా ప్రమాణాలు, శాస్త్రీయ అధ్యయనాల అవసరంపై విస్తృత చర్చ జరిగింది. దేవాలయ నిర్మాణంపై భవిష్యత్తులో ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సభ్యులు సూచించారు. రామప్ప దేవాలయానికి సంబంధించి నిరంతర పర్యవేక్షణ, శాస్త్రీయ విశ్లేషణలు, భూకంప ప్రకంపనలు లేదా మైనింగ్ కార్యకలాపాల ప్రభావాలపై అధ్యయనాలు నిర్వహించాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. పురావస్తు, అటవీ, పర్యావరణ శాఖల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి, నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, వారసత్వ కట్టడాల సంరక్షణకు సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయి అధ్యయనం అనంతరమే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జీఎం దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం సైదులు, పురావస్తు శాఖ అధికారులు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ ప్రతినిధులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఘటనపై హైకోర్టులో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

వాదనలు జరిగాయి. ప్రభుత్వం, బీఆర్ఎస్ తరఫు న్యాయవాదుల వాదనలను సుదీర్ఘంగా విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం, మహిళా ఎమ్మెల్యేలతో పోలీసుల వ్యవహారం, శాసనసభ అధికారాలు వంటి అంశాలు విచారణలో ప్రధానంగా చర్చకు వచ్చాయి. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, శాసనసభను సజావుగా నిర్వహించే బాధ్యత స్పీకర్‌పై ఉంటుందని పేర్కొన్నారు. ప్లకార్డులు, నినాదాలు, నల్లటి దుస్తులతో సభలోకి ప్రవేశించడాన్ని నిబంధనలు అనుమతించవని తెలిపారు. స్పీకర్ ఆదేశాల మేరకు చీఫ్ మార్షల్ పోలీసులకు సూచనలు చేశారని, ఆ సూచనల ప్రకారమే పోలీసులు విధులు నిర్వర్తించారని కోర్టుకు వివరించారు. అసెంబ్లీ పరిసరాల్లో ర్యాలీలు, నిరసనలపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాలు అమల్లో ఉన్నాయని కూడా తెలిపారు.
విధి నిర్వహణలో భాగంగా పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాది వాదించారు. నల్లటి టీషర్టులు ధరించి అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా విధుల్లో ఉన్న మహిళా పోలీసులతో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అనుచితంగా ప్రవర్తించారని, పోలీసు అధికారులను దూషించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో పోలీసులపై చర్యలు తీసుకోవాలంటూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోరారు. అయితే ప్రభుత్వ వాదనలపై స్పందించిన హైకోర్టు పలు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. శాసనసభ నియమావళిని సభ్యులు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని, అలాంటప్పుడు పోలీసులు ఎందుకు జోక్యం చేసుకున్నారని ప్రశ్నించింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై కూడా వివరణ కోరింది. దీనికి సమాధానంగా మహిళా ఎమ్మెల్యేలను సభలోకి వెళ్లకుండా అడ్డుకోలేదని, ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పష్టం చేశారు.
బీఆర్ఎస్ తరఫు న్యాయవాది వాదిస్తూ, అసెంబ్లీలోకి ప్రవేశించకుండా సభ్యులను అడ్డుకునే అధికారం పోలీసులకు లేదన్నారు. చీఫ్ మార్షల్‌కు స్పీకర్ నుంచి లిఖితపూర్వక ఆదేశాలు ఉన్నట్లు ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని పేర్కొన్నారు. ఒకవేళ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించినా వారిపై చర్యలు తీసుకునే బాధ్యత స్పీకర్‌దేనని, పోలీసులది కాదని వాదించారు. సభ్యులను అసెంబ్లీకి అనుమతించకుండా అడ్డుకుని, అనంతరం తెలంగాణ భవన్‌కు తరలించడం వెనుక కారణాలను కూడా ప్రశ్నించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనలకు సంబంధించి పోలీసుల పాత్ర, స్పీకర్ అధికారాలు, శాసనసభ సభ్యుల హక్కులు వంటి అంశాలపై ఈ తీర్పు కీలకంగా మారనుంది. హైకోర్టు నిర్ణయం వెలువడిన తర్వాత ఈ వివాదానికి సంబంధించి తదుపరి రాజకీయ, న్యాయపరమైన పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

## తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై
# సస్పెన్షన్ వేటు

(మొదటి పేజీ తరువాయి)

మల్లు భట్టి విక్రమార్క మద్దతు ప్రకటించారు. రాజ్యాంగబద్ధ సంస్థల గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో తీర్మానం ఆమోదం పొందిన అనంతరం దాని అధికారిక ప్రతిని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. అనంతరం మండలి నిబంధనల ప్రకారం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ చర్యలు అమలులోకి వచ్చాయి. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ సస్పెన్షన్ అంశం మరింత రాజకీయ వేడిని పెంచింది. శాసనసభ, శాసనమండలి గౌరవాన్ని కాపాడేందుకు తీసుకున్న చర్యగా అధికార పక్షం పేర్కొంటుండగా, దీనిపై బీఆర్ఎస్ నుంచి ఎలాంటి ప్రతిస్పందన వస్తుందనే అంశంపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు కోర్టులో ఊరట.. రిమాండ్ తిరస్కరణ

- **తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలకు బెయిల్ మంజూరు**
- **పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తోసిపుచ్చిన నాంపల్లి కోర్టు**
- **రూ.10 వేల వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలకు ఆదేశాలు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ శాసనసభ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్త ఘటనల కేసులో అరెస్టైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలకు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలంటూ పోలీసులు చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది. దీంతో ఇద్దరు ఎమ్మెల్సీలను వెంటనే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పాటు, విధి నిర్వహణలో ఉన్న పోలీసుల విధులకు ఆటంకం కలిగించి దాడికి పాల్పడ్డారనే అభియోగాలపై పోలీసులు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలపై కేసులు నమోదు చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ఉద్రిక్త పరిస్థితుల అనంతరం వారిని అదుపులోకి తీసుకుని నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.కోర్టులో విచారణ సందర్భంగా పోలీసులు రిమాండ్ అవసరమని వాదించగా, ఎమ్మెల్సీల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. కేసుకు సంబంధించిన అంశాలను పరిశీలించిన న్యాయస్థానం, ఈ దశలో రిమాండ్ అవసరం లేదని అభిప్రాయపడింది. దీంతో పోలీసుల అభ్యర్థనను తోసిపుచ్చుతూ బెయిల్ మంజూరు చేసింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇద్దరు ఎమ్మెల్సీలు రూ.10 వేల చొప్పున వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని సూచించింది. పూచీకత్తు సమర్పించిన వెంటనే వారిని విడుదల చేయాలని స్పష్టం చేసింది. దీంతో అరెస్టు అనంతరం కొద్ది గంటల్లోనే వారికి చట్టపరమైన ఉపశమనం లభించినట్లయింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కేసు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు శాసనమండలిలో తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ చర్యలు అమలులో ఉండగా, మరోవైపు కోర్టు రిమాండ్‌ను తిరస్కరించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. కోర్టు తాజా నిర్ణయంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. అసెంబ్లీ ఆవరణ ఘటనకు సంబంధించిన దర్యాప్తు కొనసాగుతుండగా, భవిష్యత్తులో ఈ కేసు ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్న అంశంపై రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదల కానున్నారు.

## ఆశా వర్కర్లను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదు

- ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి గిరిజ




**పెద్దమందడి, సెప్టెంబర్08(-తెలంగాణ ముచ్చట్లు):** ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని ఆశా వర్కర్ల వనపర్తి జిల్లా కార్యదర్శి గిరిజ అన్నారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలానికి చెందిన ఆశా వర్కర్లు హైదరాబాద్‌కు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఆమె తప్పుబట్టారు.ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజ డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ఆందోళన చేసేందుకు వెళ్తున్న వారిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు.ప్రజారోగ్య వ్యవస్థలో ఆశా వర్కర్లు కీలకంగా పనిచేస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్నారని తెలిపారు. వారి సమస్యలను ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కరించాల్సి ఉండగా, అరెస్టులతో అడ్డుకోవడం సరికాదన్నారు.ముందస్తుగా అరెస్టు చేసిన ఆశా వర్కర్లను వెంటనే విడుదల చేసి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని గిరిజ కోరారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి
- పెద్దమందడి మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి




**పెద్దమందడి,సెప్టెంబర్08(-తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని పెద్దమందడి మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరసన చేపట్టి మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రఘుపతి రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.పెద్దమందడి మండలంలో సాగునీరు అందక రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశారని, ప్రస్తుతం నీరు అందక తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలోని రైతులకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని రఘుపతి రెడ్డి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, గ్రామ అధ్యక్షుడు మల్లక్ సురేష్, రఘువర్ధన్ రెడ్డి, చిత్తూరు కృష్ణారెడ్డి, భూషయ్య, రాము, రంజిత్ గౌడ్, అడివన్న, నక్కల భాస్కర్, నూనె హనుమంతు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



## పెద్దమందడి–వనపర్తి రోడ్డు పనులు శరవేగంగా

- పెద్దమందడి కాంగ్రెస్ నాయకులు

**పెద్దమందడి,సెప్టెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి వనపర్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజల దీర్ఘకాలిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధికి రూ.40 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు.పలు సాంకేతిక, పరిపాలనా కారణాలతో కొంతకాలం నిలిచిపోయిన పనులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. రహదారి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు, నిర్మాణ సంస్థ చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.పెద్దమందడి-వనపర్తి రోడ్డు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వాహనదారులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని అన్నారు. పెద్దమందడి మండలంలోని పలు గ్రామాల ప్రజలకు వనపర్తి పట్టణంతో రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

# విద్యుత్ కోతలతో రైతాంగం విలవిల

- 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలి
- కోతలు వెంటనే నిలిపివేయాలి.. లేదంటే ఆందోళన ఉధృతం
- సిపిఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్




**స్టేషన్ ఘనపూర్: సెప్టెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు) :** స్టేషన్ ఘనపూర్ మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో రైతాంగం, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే విద్యుత్ కోతలను నిలిపివేసి రైతులకు 24 గంటల నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ ప్రభుత్వాన్ని, విద్యుత్ శాఖ అధికారులను డిమాండ్ చేశారు.

మంగళవారం విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ బి. సారయ్యను కలిసి విద్యుత్ కోతల సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిగెల రమేష్ మాట్లాడుతూ గతంలో రైతాంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా జరిగేదని, ప్రస్తుతం రాత్రి వేళల్లో సైతం విద్యుత్ అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గత కొద్దిరోజులుగా 12 గంటల విద్యుత్ కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని, ముఖ్యంగా గత నాలుగు, ఐదు రోజులుగా సుమారు 10 గంటలు మాత్రమే విద్యుత్ అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అదికూడా నిర్ణీత సమయపాలన లేకుండా వచ్చి పోతుండటంతో రైతులు పంటలకు నీరు పెట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

**బోర్లు, మోటార్లు దెబ్బతింటున్నాయి**

వర్షాలు లేక పంటలను కాపాడుకునేందుకు రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్న పరిస్థితి నెలకొందని రమేష్ అన్నారు. బోరు బావులు ఉన్న చిన్న, సన్నకారు రైతులు తమకున్న కొద్దిపాటి భూమిలో పంటలు సాగు చేసుకున్నారని, ఇలాంటి సమయంలో విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొనడం వల్ల బోరు మోటార్లు, స్టార్టర్లు తరచూ దెబ్బతింటున్నాయని తెలిపారు.

రైతులు ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగు ఖర్చుల రూపంలో భారీగా పెట్టుబడులు పెట్టారని, విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం కారణంగా పంటలకు సకాలంలో నీరు అందకపోతే రైతుల పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సాయంత్రం వేళల్లో ప్రజలకు చీకటి కష్టాలు

విద్యుత్ కోతల ప్రభావం రైతులకే పరిమితం కాలేదని, గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రమేష్ అన్నారు. రోజంతా కూలి పనులు, వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకునే ప్రజలకు అదే సమయంలో విద్యుత్ కోతలు విధించడంతో ఇంటి పనులు చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

సాయంత్రం విద్యుత్ కోసం ప్రజలు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని, విద్యుత్ లేక గ్రామాలు చీకటిలో మగ్గుతున్నాయని అన్నారు. విద్యార్థులు, వృద్ధులు, మహిళలు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి**

విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించాలని రమేష్ డిమాండ్ చేశారు. అప్రకటిత కోతలకు కారణాలను ప్రజలకు వెల్లడించడంతో పాటు, రైతులకు నిర్ణీత సమయాల్లో నాణ్యమైన విద్యుత్ అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించి ప్రకటనలు చేయడం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించాల్సిన బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. రైతాంగానికి 24 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడంలో అధికారులు విఫలమైతే దీనిపై ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు.

విద్యుత్ కోతలను వెంటనే నివారించి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే రైతాంగాన్ని ఏకం చేసి రాబోయే రోజుల్లో మండలవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సిపిఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు తోడెంగల ఐలయ్య, చిలుముల్ల భాస్కర్, మంద మహేందర్, పోలసు పరమేష్, ఇప్పగూడెం ఉపసర్పంచ్ లింగనబోయిన రాజు, నాయకులు వంగపండ్ల సోమయ్య, బోయిని రాజయ్య, సట్ల రాజు, గోడిశాల రవి, పెద్దరబోయిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ ఆందోళన

- 420 హామీలు, ఆరు గ్యారంటీల అమలు ఏదీ?
- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్




**పెద్దమందడి,సెప్టెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల అనుసారం కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను తక్షణమే అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు.

పెద్దమందడి మండలంలో రైతులు సాగు చేసిన పంటలు సాగునీరు అందక ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశారని, ప్రస్తుతం పంటలకు నీరు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలంలోని రైతులకు తక్షణమే సాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రైతుల తరఫున మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు పెద్దమందడి మండలంలోని రైతులకు వెంటనే సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ రైతుబంధు అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, మండల అధ్యక్షుడు వేణు, వెంకట్ రెడ్డి, నాగేంద్రం, రామేశ్వర్ రెడ్డి, మనిగిళ్ల సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, వెల్టూర్ సర్పంచ్ అశోక్, గట్టు సతీష్, రఘువర్ధన్ రెడ్డి,మలక్ సురేష్, బలీదు పల్లి అంజి, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ గద్వాల కృష్ణ మాదిగకు ఘన సన్మానం



**వనపర్తి,సెప్టెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన గద్వాల కృష్ణ మాదిగను వనపర్తి జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఈఎఫ్ రాష్ట్ర ఆర్గనైజర్ జనరల్ సెక్రటరీ బోరెల్లి వెంకటయ్య మాదిగ ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గద్వాల కృష్ణ మాదిగకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించడం సామాజిక న్యాయ ఉద్యమానికి లభించిన గుర్తింపుగా పేర్కొన్నారు. మాదిగ సమాజ హక్కులు, ఆత్మగౌరవం, ఎస్సీ వర్గీకరణ, బహుజన సంక్షేమం కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ఇంచార్జీ కొమ్మవారి మస్తాన్ మాదిగ, నియోజకవర్గ ఇంచార్జీ కొమ్ము చెన్నకేశవులు మాదిగలు గద్వాల కృష్ణ మాదిగను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో ఎంఈఎఫ్ ఉద్యమం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో చింతకుంట మద్దిలేటి మాదిగ, కేశపోగు కేశవులు మాదిగ, మీసాల నాగరాజు మాదిగ, మొలకలపల్లి పరుషరాముడు మాదిగ, అరకల రమేష్ మాదిగ, మచ్చ తిరుపతి మాదిగ, పుట్టపగ అజయ్ కుమార్ మాదిగ, దయ్యపు రవివర్మ మాదిగ, స్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## హామీలతో గెలిచారు.. అమలుతో నిలబడాలి

- ప్రజలను మోసం చేస్తే ఊరుకునేది లేదు.
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తెలంగాణ రక్షణ సేన ఆగ్రహం




**కరీంనగర్, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు ):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేలు పెట్టుబడి సాయం, రైతులకు రూ.500 బోనస్, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, సంక్షేమ బోర్డు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, యువతకు 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, యువ వికాసం కింద ఆర్థిక సహాయం, వృద్ధులు, వితంతువులకు రూ.4 వేల పింఛన్, మహిళలకు తులం బంగారం వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, బీసీ సంక్షేమానికి ఏటా రూ.20 వేల కోట్ల కేటాయింపు, ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 'అంబేద్కర్ అభయహస్తం' కింద రూ.12 లక్షల సాయం, మైనారిటీల సంక్షేమానికి రూ.4 వేల కోట్ల నిధులు వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్‌తో పాటు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం, ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం, అర్హులైన జర్నలిస్టులు, ప్రాక్టీసింగ్ న్యాయవాదులకు ఇంటి స్థలాలు, గల్ఫ్ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకుని మరింత ఉధృతమైన ఉద్యమాలు చేపడతామని హరిప్రసాద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణకు హామీల ప్రభుత్వం కాకుండా హామీలను అమలు చేసే నాయకత్వం అవసరమని, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మ నాయకత్వంలోనే అది సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి లింగంపల్లి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం శివరాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, ఆదివాసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# చింతకుంటలో ఘనంగా అంబికా బ్యాంకెట్ హాల్ ప్రారంభం



• ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి: అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి

**కరీంనగర్, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు ):** కరీంనగర్ శివారులోని చింతకుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబికా ఏసీ బ్యాంకెట్ హాల్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి ప్రారంభించారు. కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ కార్యాలయం పైభాగంలో ఈ బ్యాంకెట్ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వాణిజ్య రంగంలో నూతన ఒరవడిని సృష్టించేలా ముందుకు సాగాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన సేవలను అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలపై ముల్కనూర్ పోలీసుల సూచనలు

- మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి



**భీమదేవరపల్లి, సెప్టెంబర్ 08(తెలంగాణ ముచ్చట్లు):** 2026గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ప్రతి గణేష్ మండపం నిర్వాహకులు ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌కు ఇంటిమేషన్ ఇవ్వాలని పోలీసులు సూచించారు.ఈ ఏడాది తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గణేష్ మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్ పూర్తి చేయాలని తెలిపారు. గత సంవత్సరం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న నిర్వాహకులు తమ ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ లేదా గత సంవత్సరం రిఫరెన్స్ ఐడీ ద్వారా సెర్చ్ చేస్తే గతంలో నమోదు చేసిన వివరాలు అప్లికేషన్‌లో ఆటోమేటిక్‌గా కనిపిస్తాయని పేర్కొన్నారు.
అనంతరం ప్రస్తుత గణేష్ విగ్రహం ఎత్తు, నిమజ్జనం తేదీ, సమయం, వినియోగించే వాహనం తదితర తాజా వివరాలను అప్లికేషన్‌లో నమోదు చేయాలని కోరారు.అలాగే సంబంధిత విద్యుత్ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి గణేష్ మండపంలో ఒక కెమెరాను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను మద్యపాన రహితంగా, పర్యావరణానికి ఎలాంటి విఘాతం కలగకుండా నిర్వహించాలని, డీజేలు వినియోగించకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని ముల్కనూర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న లక్ష్మణ్ నాయక్



**పెద్దమందడి,సెప్టెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ నాయక్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ప్రధానోపాధ్యాయుడిగా ఉత్తమ సేవలు అందించినందుకు మండల విద్యాధికారిణి మంజులత చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు లక్ష్మణ్ నాయక్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి, పాఠశాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు.కార్యక్రమంలో రేవల్లి మండల విద్యాధికారి వరప్రసాద్ రావు, వెల్టూర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు, పెద్దమందడి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న, పెద్దమందడి సర్పంచ్ సూర్య గంగా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

• అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి బీఆర్ఎస్ నిరసన



**కరీంనగర్, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు ):** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లో నిరసన నిర్వహించారు. కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట్‌లో ప్రతిభతో ఎంబీబీఎస్ సీటు సాధించిన యువరాజ్‌కు సన్మానం



**పెద్దమండడి,సెప్టెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామానికి చెందిన గట్టు రమేష్ కుమారుడు యువరాజ్ నీట్ ఫలితాల్లో 397 మార్కులు సాధించి సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన సందర్భంగా అంబేద్కర్ యువకులు, కాలనీవాసులు ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కాలనీ పెద్దలు మాట్లాడుతూ యువరాజ్ తల్లిదండ్రులు కష్టపడి పనిచేస్తూ కుమారుడిని ఉన్నతంగా చదివించారని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని సాధించవచ్చని యువరాజ్ నిరూపించాడని అన్నారు. నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీటు సాధించడం గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.యువరాజ్ వైద్య విద్యలో రాణించి పేదలకు సేవ చేయాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అంబేద్కర్ ఆశయాలైన విద్య, అభివృద్ధి, సమానత్వం దిశగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు గట్టు సతీష్, గట్టు వరలక్ష్మి, గట్టు నాగమనెమ్మ, గ్రామ మాజీ సర్పంచ్ గట్టు మన్యం, కాలనీ పెద్దలు గట్టు నారాయణ, గట్టు దయాకర్, గట్టు పెంటన్న, గట్టు కృష్ణయ్య, యువకులు గట్టు చిన్నయ్య, జనంపల్లి మన్యం, గట్టు కళ్యాణ్ బాబు, గట్టు రాజు, గట్టు మల్లేష్, గట్టు విజయ్, గట్టు శివ, గట్టు నగేష్, గట్టు బల్‌రామ్, గట్టు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# నేత్రదానం మహాదానం.. ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి

- నేత్రదానంపై అపోహలను వీడి అవగాహన పెంచుకోవాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్




**కరీంనగర్, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు ):** నేత్రదానం ద్వారా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం, జాతీయ నేత్రదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌కు చెందిన వాసన్ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్రదాన అవగాహన సదస్సు, అవగాహన నడక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు, అపార్థాలను తొలగించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్నియల్ అంధత్వాన్ని తగ్గించేందుకు చేపట్టిన 'స్కాన్ & ప్లెడ్జ్' కార్యక్రమాన్ని అభినందించారు. నేత్రదాన ఉద్యమానికి వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని కోరారు. అనంతరం నేత్రదాతల కుటుంబ సభ్యులు, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను మేయర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాసన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ మైథిలి, డాక్టర్ టి. హరిత గౌడ్, డాక్టర్ శ్రీలేఖ, సెంటర్ మేనేజర్ వంశీ, వాసన్ ఐ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అరవింద్, సిబ్బంది, నేత్రదాతల కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్ లను అడ్డుకోవడం అ ప్రజాస్వామ్యం



**మంచిర్యాల, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు):** హక్కుల సాధన కోసం శాంతియుతంగా అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఉప సర్పంచ్ ల ను పోలీసులు ముందస్తుగా నిర్బంధించడం అ ప్రజాస్వామ్యం అని మందమర్రి మండల ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు గిర్నాటి జనార్ధన్ అన్నారు, రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తనతో పాటు పలువురు ఉప సర్పంచ్లను రామకృష్ణాపూర్, మందమర్రి పోలీసులు అడ్డుకొని పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని తెలిపారు, ఉప సర్పంచ్లకు గౌరవ వేతనం, జాయింట్ చెక్ పవర్, అభివృద్ధి పనుల శిలాఫలకాలపై పేర్ల ఏర్పాటు, తగిన అధికారాలు కల్పించాలని డిమాండ్ చేశారు, వార్డు సభ్యులకు కూడా గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు, ప్రభుత్వం వెంటనే ఉప సర్పంచ్ల ఫోరం నాయకులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్లు దుర్గం శ్రీనివాస్, పోరెడ్డి మొండి, రాజన్న, ఎమ్బాడీ సతీష్, దుర్గం పోశం తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతే మహాగణపతి

- పర్యావరణ పరిరక్షణే మన బాధ్యత
- ప్రతి ఇంటా మట్టి గణపతిని ప్రతిష్టించి పర్యావరణాన్ని కాపాడాలి: మేయర్




**కరీంనగర్, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు ):** వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రజలకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.
"హమారా ఉన్నత మార్గ్" స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన "మన గణపతి-మట్టి గణపతి" వాల్ పోస్టర్‌ను మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఓపీ విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, సహజసిద్ధమైన మట్టి విగ్రహాలను పూజించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. "మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించే వినాయక మండపాల నిర్వాహకులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. నవరాత్రుల్లో మట్టి గణపతి మండపాలను సందర్శించి నిర్వాహకులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్, సభ్యులు తోడుపునూరి తిరుపతి, కార్పొరేటర్లు తోట అనిల్, శరత్ చంద్ర, అపర్ణ జితేందర్, దేవసాని సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు అందక ఎండిపోతున్న పంటలు

- వెల్టూర్ రైతుల ఆవేదన



**పెద్దమందడి,సెప్టెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని గోపాల సముద్రం చెరువు కింద సుమారు 500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పంట సాగుకు అవసరమైన సమయంలో సాగునీరు అందకపోవడంతో ప్రస్తుతం వరి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని వెల్టూర్ గ్రామ రైతులు వాపోయారు. సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు నీరు విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. నీళ్లు ఇస్తామని చెప్పారు.. ఇప్పటివరకు నీళ్లు రాలేదు. పంటలు ఎండిపోతున్నాయి. ఇకనైనా నీళ్లు వదిలి మా పంటలను కాపాడాలి. నీళ్లు అందిస్తేనే మేము బతుకుతాం అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశామని, తీరా పంట చేతికొచ్చే సమయంలో సాగునీరు అందకపోవడంతో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికే పంటలు వాడిపోతున్నాయని, మరికొన్ని రోజులు నీరు అందకపోతే పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ నేతల హైదరాబాద్ యాత్రకు బ్రేక్.. పోలీసుల ముందస్తు అరెస్టులు!

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ శ్రేణుల తీవ్ర ఆగ్రహం




**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపుతో హైదరాబాద్‌కు బయలుదేరుతున్న కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలో రాజకీయ వేడి రాజేసింది. హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమానికి హాజరయ్యేందుకు సిద్ధమైన నాయకులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేసీఆర్ పిలుపుతో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్ తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే వారు బయలుదేరే సమయంలోనే పోలీసులు రంగంలోకి దిగి పలువురు నాయకులను అదుపులోకి తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. దీంతో ఇల్లంతకుంటలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.
ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించే కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. ప్రజల గొంతుకగా నిలిచే ప్రతిపక్షాన్ని అణచివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తోందని ఆరోపించారు. అరెస్టులు, నిర్బంధాలతో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని, ప్రజాస్వామ్య హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## అక్షర జ్ఞానమే సామాజిక ప్రగతికి పునాది



- **ఇల్లంతకుంటలో ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం**

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హుజూరాబాద్‌కు చెందిన సామాజికవేత్త, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో 'అక్షరాస్యత-సామాజిక అభివృద్ధి' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఈ పోటీల్లో పాఠశాలలోని 8, 9, 10వ తరగతులకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పదో తరగతికి చెందిన మంకు రచన ప్రథమ, బి. రాజేష్ ద్వితీయ, వీ. శరణ్య తృతీయ స్థానాలను సాధించారు. ఎనిమిదో తరగతికి చెందిన పి. అక్షయ నాలుగో, ఎన్. శృతి ఐదో, తొమ్మిదో తరగతికి చెందిన టి. సూర్యతేజ ఆరో స్థానంలో నిలిచారు.

పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శంకర్ నారాయణ డిక్షనరీలను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కే. జయప్రకాష్, డాక్టర్ జగదీశ్వర్, ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కే. జయప్రకాష్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఏటా పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. మెరిట్ స్కాలర్‌షిప్‌లు, పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, గణితం, సైన్స్ ప్రతిభా పోటీలు నిర్వహిస్తూ విద్యార్థులను ఉన్నత చదువుల వైపు ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

ఉపాధ్యాయుడు సిహెచ్. వేణు మాట్లాడుతూ.. గణితం, సైన్స్, ఇంగ్లీష్ ప్రతిభా పరీక్షలతో పాటు చేతిరాత పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు, నగదు పురస్కారాలు, ఇంగ్లీష్ డిక్షనరీలు అందజేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే. జయప్రకాష్, సిహెచ్. వేణు, కొండ సత్యం, జి. అన్నపూర్ణ, కే. శంకర్, జె. రాధికారాణి, ఏ. సురేష్, డి. ఉమాదేవి, ఎం. ఐలయ్య, సిహెచ్. రామకృష్ణ, జి. శైలజ, ఆర్. దేవేందర్, ఎం. స్రవంతి, వనిత, డి. పరమేష్, విశ్వతేజతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలు తెలుసుకున్న కౌన్సిలర్



- **బీసీ హాస్టల్‌ను సందర్శించి వసతులపై ఆరా..**
- **50 మంది విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ**

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని బీసీ హాస్టల్‌ను 6వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడి హాస్టల్‌లో అందుతున్న అల్పాహారం, భోజనం తదితర వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాభ్యాసానికి సంబంధించి ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం హాస్టల్‌లోని 50 మంది విద్యార్థులకు భోజనం చేసేందుకు ప్లేట్లను పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలను తెలుసుకుని వారికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్ మాట్లాడుతూ.. తమ హౌసింగ్ బోర్డు ప్రజల ఆశీస్సులతో విద్యార్థి దశ నుంచే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, పేద ప్రజలు, విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ప్రజాప్రతినిధులుగా సేవ చేసే అవకాశం లభించిందని, భవిష్యత్తులోనూ ప్రజలకు, విద్యార్థులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వార్డెన్ నరేష్, స్వరాజ్, రాజేష్, ఇమ్రాన్ తదితరులతో పాటు హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నాయిని చెరువులో గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు

- **అన్ని శాఖల సమన్వయంతో చర్యలు..**
- **నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలోని నాయిని చెరువులో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ తెలిపారు. మంగళవారం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన నాయిని చెరువు పరిసరాలను పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా చర్యలపై అధికారులతో చర్చించారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కూడా నిమజ్జనానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు చైర్మన్ తెలిపారు. గణేష్ మండపాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, పోలీసు, మున్సిపల్ అధికారుల సూచనలకు అనుగుణంగా ఉత్సవాలను నిర్వహించాలని ఆయన సూచించారు. నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన ప్రాంతంలో పారిశుద్ధ్యం, విద్యుత్, పోలీసు బందోబస్తు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, హుజూరాబాద్ ఏసీపీ మాధవి, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, ఏఈ వికాస్, సీఐ రామకృష్ణ, ఎస్ఐ, తహసీల్దార్ గడ్డం సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, ఆర్ఐ, విద్యుత్ శాఖ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# తాత మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గుమంది!

- **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలి**
- **జమ్మికుంటలో తాత మధు దిష్టిబొమ్మ దహనం**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జమ్మికుంటలో కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. జమ్మికుంట ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దొగ్గల భాస్కర్, పట్టణ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాతకాల అనిల్ ఆధ్వర్యంలో తాత మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని గౌరవించకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని అన్నారు. రాజకీయ విమర్శలు చేయడంలో తప్పులేదని, అయితే వ్యక్తిగతంగా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులకు గౌరవం ఉండాలని.. రాజకీయాల్లో హుందాతనం పాటించాలని సూచించారు. అనుచిత వ్యాఖ్యలకు ప్రజాస్వామ్య పద్ధతిలోనే సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు తాత మధు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మొలుగురు సదయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు సాయిని రవి, జమ్మికుంట కౌన్సిలర్ దిద్ది రాము, ఒగ్గు రమేష్, ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ దొడ్డ శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పార్లపల్లి నాగరాజు, జమ్మికుంట దుబ్బ మల్లన్న చైర్మన్ ముద్దమల్ల రవి, జిల్లా కార్యదర్శి మేకమాల అశోక్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు వాసాల సుధీర్, బోయిని రాజ్‌కుమార్, రాచపల్లి శ్రీనివాస్, పంజాల అజయ్, కొండు బిక్షపతి, రోమాల రాజ్‌కుమార్, శంకర్, నరసన్న, మైస రమేష్, అనిల్, పాతకల ప్రవీణ్, గుల్లి జపానియా, రమేష్, శివ, ములుగురు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలి

- **సీపీఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిట్యాల ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా సాగిన చారిత్రాత్మక పోరాటమని రమేష్ యాదవ్ పేర్కొన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో సాగిన పోరాటం ద్వారా పేద ప్రజలకు న్యాయం జరిగిందని అన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో తెలంగాణలో సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందని పేర్కొన్నారు.

వారోత్సవాల్లో భాగంగా బైక్ ర్యాలీలు, వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17న ముగింపు కార్యక్రమంగా భారీ సభ నిర్వహిస్తామని చెప్పారు. రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ విలేకరుల సమావేశంలో దండిగారి సతీష్, వడ్లూరి కిషోర్, తాటికంటి రంజిత్ కుమార్, తూర్పాటి నాగరాజు, కొప్పుల మహేష్ పాల్గొన్నారు.

## దళితుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి

- **దళితబంధు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి**

**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** దళితబంధు బాధితుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని దళితబంధు సాధన సమితి హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలుగూరి నరేష్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 9న బుధవారం జమ్మికుంటలోని ఎంపీర్ గార్డెన్‌లో నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకు నియోజకవర్గంలోని దళితబంధు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సభకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబును దళితబంధు సాధన సమితి నాయకులు సాదరంగా ఆహ్వానించినట్లు తెలిపారు. దళితబంధు లబ్ధిదారుల సమస్యలు, వారి హక్కులు, సాధించాల్సిన అంశాలపై సభలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నియోజకవర్గంలోని ప్రతి దళితబంధు లబ్ధిదారుడు సభకు తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.


అలాగే హుజూరాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సభకు హాజరై కార్యక్రమాన్ని వార్తా రూపంలో ప్రజలకు తెలియజేయాలని దళితబంధు సాధన



సమితి నియోజకవర్గ కమిటీ తరపున ప్రత్యేకంగా ఆహ్వానించారు.

# వినాయక ఉత్సవాలకు జమ్మికుంటలో పకడ్బందీ ప్రణాళిక

- **పోలీస్, విద్యుత్ శాఖల వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో జమ్మికుంట పట్టణ పరిధిలో ఏర్పాటు చేయనున్న వినాయక మండపాల నిర్వాహకులతో మంగళవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చైర్మన్ దిలీప్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌తో పాటు విద్యుత్ శాఖ కార్యాలయంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద భక్తుల భద్రతకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుడి నిమజ్జన ఊరేగింపును వీలైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, భక్తులు గణనాథుడిని దర్శించుకునే అవకాశం ఉండేలా సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా, సంతోషకర వాతావరణంలో పూర్తయ్యేలా మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించాలని చైర్మన్ కోరారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు, ఏసీపీ మాధవి, సీఐ రామకృష్ణ, ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, తహసీల్దార్ గడ్డం సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, విద్యుత్ శాఖ ఏఈ, ఇతర అధికారులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ అవినీతిపై దర్యాప్తు తీరేంటి?

- **విజిలెన్స్, ఏసీబీ అధికారుల చర్యలపై బీజేపీ నేతల అనుమానాలు**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవలని డిమాండ్**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినియోగంపై జరుగుతున్న విచారణ తీరుపై బీజేపీ నాయకులు అనుమానాలు వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జమ్మికుంట పట్టణ బీజేపీ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు.

ఈ సందర్భంగా కొలకాని రాజు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కనుమల్ల విజయ, మాజీ మున్సిపల్ చైర్మన్ శీలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నిధుల దుర్వినియోగంపై స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్ నాయకత్వం తరపున నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు.

కౌన్సిల్ తీర్మానం లేకుండా నిధుల దుర్వినియోగం జరిగితే సంబంధిత అధికారుల బాధ్యతను కూడా విచారణలో పరిగణనలోకి తీసుకోవాలని వారు పేర్కొన్నారు. మున్సిపల్ నిధులకు కమిషనర్ ప్రధాన కార్యనిర్వహణ అధికారిగా వ్యవహరిస్తారని, తీర్మానం లేని బిల్లులు, అక్రమ చెల్లింపులు, నిధుల విడుదలపై పర్యవేక్షణ అధికారుల ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. కింది స్థాయి సిబ్బందిపై మాత్రమే చర్యలు తీసుకుని, అప్పటి కమిషనర్, చైర్మన్ పాత్రపై చర్యలు తీసుకోకపోవడంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు. కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న నేపథ్యంలో నెలల తరబడి విచారణ జరిపి చివరకు పరిమిత మొత్తాన్ని మాత్రమే రికవరీ చేయాలని సూచించడం సరైన దర్యాప్తు విధానం కాదని విమర్శించారు.

విజిలెన్స్, ఏసీబీ అధికారుల చర్యలపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని, మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సమగ్రంగా స్పందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాధనానికి సంబంధించిన వ్యవహారంలో పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు.

మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా, ముట్టడి కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

విలేకరుల సమావేశంలో జిల్లా ఓబీసీ అధ్యక్షుడు ఆకుల రాజేందర్, బచ్చు శివన్న, కైలాసకోటి గణేష్, రాచపల్లి ప్రశాంత్, ఆదువాల శ్రీధర్, కేస స్వరూప, గరెపల్లి నిరూపరాణి, ఆకుల తిరుపతి, పల్లపు రవి, కొండ్లె నగేష్, గంగాభవాని, పుల్లూరి ప్రశాంత్, రాయబారపు సురేష్, బల్బుకూరి రాజేష్, శ్రీవర్తి అఖిల్, అప్పాల రవీందర్, ముకుంద సుధాకర్, యాంసాని సమ్మయ్య, పోలు వెంకటేష్, నెల్లి రాజు, సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుధవారం - 09 - సెప్టెంబర్ - 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సూక్ష్మ, చిన్న పరిశ్రమలతో సుస్థిర ఆర్థికాభివృద్ధి

- **తక్కువ పెట్టుబడితో అధిక ఉపాధి అవకాశాలు**
- **జాతీయ వెబినార్‌లో ఆర్థికవేత్తల అభిప్రాయాలు**



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల రంగం ద్వారా దేశంలో సుస్థిర ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల జమ్మికుంట అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సూక్ష్మ మరియు చిన్న తరహా పరిశ్రమల రంగం-భారతదేశంలో సుస్థిర ఆర్థిక అభివృద్ధి సాధన' అనే అంశంపై జాతీయ స్థాయి వెబినార్ నిర్వహించారు.
ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేష్ మాట్లాడుతూ సహజ వనరులు, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక అభివృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.
శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కే. శ్రీవాణి మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. స్థానిక వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఈ పరిశ్రమలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఐసీఎఫ్ఏఐకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లైలా మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల రంగం దేశ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 31 శాతం, ఉత్పత్తి రంగంలో 35 శాతం, ఎగుమతుల్లో 49 శాతం వాటాను కలిగి ఉందని వివరించారు. ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను విద్యార్థులకు వివరించారు. పరిశ్రమల అభివృద్ధి, సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధనకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, తీసుకుంటున్న చర్యలను వివరించారు.
కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కే. రాజేంద్రం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. కుమార్, కళాశాల అధ్యాపకులు, వివిధ కళాశాలల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వీణవంకలో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు



- **ధర్నాలకు పిలుపు నేపథ్యంలో పోలీసుల చర్యలు**

**వీణవంక, సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో బీఆర్ఎస్ నాయకులను మంగళవారం తెల్లవారుజామున పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం జరిగిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టును ఖండిస్తూ మంగళవారం మండల వ్యాప్తంగా ధర్నాలు చేపట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమవుతున్న నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.
అరెస్టులపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. తమ పార్టీ శ్రేణులను ముందస్తుగా అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని, ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

# అంబేద్కర్‌ను అవమానిస్తే ఊరుకునేది లేదు

- **హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ**



**హన్మకొండ,సెప్టెంబర్8(తెలంగాణ ముచ్చట్లు):** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను కించపరిచేలా రచనలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హమారా ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు.మంగళవారం హన్మకొండలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్‌ను 'కల్పిత నాయకుడు'గా పేర్కొంటూ 'ది ఫ్యాబ్రికేటెడ్ లీడర్' పేరుతో పుస్తకం రాయడం కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకంలో అంబేద్కర్‌ను 'దేశ వ్యతిరేకి, హిందూ వ్యతిరేకి, వేర్పాటువాది'గా చిత్రీకరించారని, దీనివల్ల సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, హక్కులను కల్పించారని ఉపేందర్ మాదిగ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ద్వారా సమానత్వ హక్కు, ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనాన్ని నిషేధించడం వంటి కీలక నిబంధనలు సామాజిక మార్పుకు బాటలు వేశాయని అన్నారు. అంబేద్కర్‌ను అవమానించే వ్యాఖ్యలు, రచనలను ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, 'కల్పిత నాయకుడు' పుస్తకంపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పుస్తకంలోని అంశాలు చట్టపరంగా నేరానికి దారితీస్తే సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి రచనల వెనుక ఉన్న వ్యక్తులు, సంస్థల పాత్రపై కూడా విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జమ్మికుంటలో రాజకీయ వేడి.. కాంగ్రెస్ దిష్టిబొమ్మ దగ్ధానికి బీఆర్ఎస్వీ యత్నం!



**జమ్మికుంట టౌన్ సెప్టెంబర్ 08 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలో నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులను ఖండిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్వీ నాయకులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్, జి.అనిల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ప్రతిపక్ష హోదాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై అసెంబ్లీకి నిరసనగా వెళ్తే వారిని అడ్డుకుని అరెస్టు చేయడం, అనుచితంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎన్ని అరెస్టులు చేసినా, లాఠీచార్జ్‌లు చేసినా తాము భయపడేది లేదని నరేష్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల హక్కుల కోసం పోరాడిన అనుభవం తమకు ఉందని, ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, సబ్బండ వర్గాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైతే గాంధీభవన్ ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నల్లగాసే హరీష్, బి. ప్రశాంత్, వార్డు అధ్యక్షులు ఎం.డి. సలీం, మల్లికార్జున్, శ్రీనివాస్, అబ్రార్, సన్నీ, రాజు, సిద్ధూ, రమేష్, కౌశిక్, వినయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధును బర్తరఫ్ చేయాలి

- **వనపర్తిలో కాంగ్రెస్ శ్రేణుల భారీ నిరసన**



**వనపర్తి,సెప్టెంబర్08(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వనపర్తి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. తాతా మధును వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేసి, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేనారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ నిరసనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు తాతా మధు తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ స్పీకర్ పదవిని కించపరిచే విధంగా మాట్లాడటం తాతా మధు అహంకారానికి పరాకాష్ట అని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, దళితులను అవమానించే విధంగా మాట్లాడటం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. స్పీకర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడే హక్కు ఎవరికీ లేదని, అధికార అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తాతా మధును తక్షణమే పదవి నుంచి తొలగించి, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశాయి. తాతా మధు వ్యాఖ్యలను సమర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు దళిత సమాజానికి, సభ్య సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. అదేవిధంగా అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాని ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌పై కూడా శాసనసభ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. తాతా మధుపై చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి బీఆర్ఎస్‌కు ప్రజాక్షేత్రంలో తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జనరల్ సెక్రటరీ, అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు కదిరి రాములు, మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రమాదంగా మారిన ఎల్కతుర్తి చౌరస్తా

- **రాంగ్‌రూట్‌లో దూసుకొస్తున్న బస్సులు.. అడ్డుకున్న యువకులు**
- **సూచిక బోర్డులు లేక వాహనదారుల అవస్థలు.. రాత్రివేళల్లో వెలగని లైట్లు**
- **ప్రమాదాలకు అడ్డాగా మారుతున్నా పట్టించుకోని అధికారులు**



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి చౌరస్తా రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చౌరస్తాలో వాహనాలు ఏ మార్గంలో వెళ్లాలి.. ఏ మార్గంలో రాకపోకలు సాగించాలి అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేసే సూచిక బోర్డులు, దిశానిర్దేశక బోర్డులు లేకపోవడంతో తరచూ వాహనాలు రాంగ్‌రూట్‌లోకి వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. మంగళవారం సాయంత్రం ఎల్కతుర్తి చౌరస్తాలో ఓ ఆర్టీసీ బస్సు రాంగ్‌రూట్‌లో రావడంతో అక్కడ ఉన్న యువకులు అప్రమత్తమై బస్సును అడ్డుకున్నారు. బస్సు డ్రైవర్‌కు పరిస్థితిని వివరించి, రాంగ్‌రూట్‌లో కాకుండా సరైన మార్గంలో వెళ్లాలని సూచించారు. దీంతో కొద్దిసేపు చౌరస్తాలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**నిత్యకృత్యంగా మారిన రాంగ్‌రూట్ ప్రయాణాలు**

ఎల్కతుర్తి చౌరస్తాలో రాంగ్‌రూట్‌లో వాహనాలు రావడం ఇది ఒక్కరోజు జరిగిన ఘటన కాదని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో రాంగ్‌రూట్‌లోకి వస్తున్న సందర్భాలు తరచూ కనిపిస్తున్నాయని చెబుతున్నారు. భారీ వాహనాలు ఎదురుగా వచ్చే సమయంలో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, చిన్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన స్పష్టమైన సూచికలు లేకపోవడం వల్ల కొత్తగా వచ్చే వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఒక్క వాహనం రాంగ్‌రూట్‌లోకి వచ్చినా ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించుకునే క్రమంలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రమాదాలకు అడ్డాగా మారుతున్న చౌరస్తా**

ఎల్కతుర్తి చౌరస్తా ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలకు వేదికగా మారిందని స్థానికులు గుర్తుచేస్తున్నారు. చౌరస్తాలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని వాహనాల రాకపోకలకు స్పష్టమైన మార్గాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**రాత్రివేళల్లో వెలగని లైట్లు**

పగటిపూటే పరిస్థితి ఇలా ఉంటే రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. చౌరస్తాలో ఏర్పాటు చేసిన లైట్లు సక్రమంగా వెలగకపోవడం, చీకటి సమయంలో వాహనాలు ఒకదానికొకటి స్పష్టంగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని అంటున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

**అధికారులు స్పందించాలి**

ఎల్కతుర్తి చౌరస్తాలో వెంటనే సూచిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్, దిశానిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రాత్రివేళల్లో లైట్లు నిరంతరం వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానిక యువకులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి రాంగ్‌రూట్‌లో వాహనాలు వెళ్లకుండా కట్టడి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎల్కతుర్తి చౌరస్తాలో శాశ్వత పరిష్కారం చూపాలని, మరో ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తాత మధు వ్యాఖ్యలపై కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

- **అట్టుడికిన స్టేషన్‌ఘన్‌పూర్.. భారీ ర్యాలీ, రాస్తారోకో**
- **తాత మధు దిష్టిబొమ్మ దగ్ధం**
- **బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక వైఖరి**
- **మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్**




**స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆందోళనకు దిగాయి. మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని శివాజీ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీ చేపట్టారు. అనంతరం జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. తాత మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని, అనుచిత వ్యాఖ్యలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి నుంచీ దళితుల పట్ల వ్యతిరేక వైఖరితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే దళిత వ్యతిరేక పార్టీగా ప్రజల్లో ముద్ర పడిందని విమర్శించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాత మధు చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకార ధోరణికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యరెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు నూకల ఐలయ్య యాదవ్, చిర్ర నాగరాజుగౌడ్, మహేందర్‌రెడ్డి, మనోహర్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ

- **కుటుంబానికి అండగా ఉంటాం**
- **సింగపురం ఇమ్మానియేల్ రాజ్ భరోసా**

**స్టేషన్‌ఘన్‌పూర్,సెప్టెంబర్8(తెలంగాణ ముచ్చట్లు):** నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగపురం ఇందిర తనయుడు, యువ నాయకుడు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో పర్యటించారు. ఇటీవల మృతి చెందిన గట్టు వెంకటలక్ష్మి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మృతురాలి నివాసానికి వెళ్లిన ఇమ్మానియేల్ రాజ్.. కుటుంబ సభ్యులను ఓదార్చి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం వెంకటలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైన సమయంలో తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. కుటుంబ అవసరాల నిమిత్తం బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ప్రధాన కార్యదర్శి వద్దూరి మౌనిక, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సింగపురం నాగయ్య, జిల్లా కార్యదర్శులు చాగంటి మ, తాటికొండ సంపత్, సీనియర్ నాయకులు చింత ఎల్లయ్య, నారగోని పద్మ, నారగోని సరిత, సింగపురం ప్రతిష్ తదితరులు పాల్గొన్నారు.





# మహిళలను అరెస్టు చేయడం బాధాకరం

**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లను అరెస్టు చేయడం బాధాకరమని ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కింసారపు సంధ్య అన్నారు. అరెస్టు చేసిన ఆశా వర్కర్లను వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెబుతూ, తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న మహిళలను అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అరెస్టులకు పాల్పడటం సరికాదన్నారు.

ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశా వర్కర్లపై ఉన్న పని ఒత్తిడిని తగ్గించి, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

అరెస్టయిన వారిలో కర్రే సరూప, సునంద, సునీత ఉన్నారని తెలిపారు. ఆశా వర్కర్లపై అరెస్టులు, నిర్బంధాలు కాకుండా వారి సమస్యలపై ప్రభుత్వం చర్చించి న్యాయం చేయాలని కింసారపు సంధ్య కోరారు.

# చరిత్ర నిర్మాతలు!

సామ్రాజ్య వాదులారా!
అమానుషత్వంతో
మీరు యుద్ధాలకు సిద్ధం!
మీకుతెలిసిన విద్యఅది!

చేస్తూనే ఉన్నారు కదా!
ఎందర్ని చంపుతారు!
యుద్ధ రాజకీయం కూడా
ఇప్పుడు సాగేదికాదు!

వియత్నాం క్యూబాలను
ఏం చేయగలిగారు!
ప్రజలు దీక్షాదక్షులైతే!
'మీకు' ఓటమి ఖాయం!

వలసదేశాల ప్రజలు
తెలుసుకున్నారు!
మీసైనికశక్తి కూడా
వాళ్లనేమీ చెయ్యలేదు!

ఇంకా విభజిస్తారా?
కొత్త మోసాలున్నాయా?
మీకే తెలియాలి!
అనుభవజ్ఞులు కదా!

ఇప్పటికే ప్రపంచాన్ని
మీ స్వార్థంకోసం
రోగాలు రొచ్చులతో
భ్రష్టు పట్టించారు!

నాకు అనిపిస్తోంది
ముసుగులేసుకుని మీరు
వామపక్షాల్లోకి వచ్చేస్తారు!
నేనుచెప్పేదేముందిలే!

మీ బుద్ధులలాంటివి!
వేల సంవత్సరాలుగా
దోపిడి దోపిడి దోపిడి
మోసం వంచన హింస!

రెడీ ఔతున్నారా?
త్యాగశీల నాయకులకు
మీ ముసుగులు
మరింత భారమౌతాయి!

భూమాత కన్నీటి ధార!
మరోసారి మోసానికి
తెరతీస్తున్నందుకు!
అమానుషానికి అడ్రస్ మీరు!

ఇదేకాని జరిగితే
వామపక్ష నాయకులారా!
మార్క్స్ అంబేద్కర్
అనుయాయులారా!

సామ్రాజ్య వాదులకు
తొత్తులు బూర్జువాలు!
పార్టీలు మారటంలో
వీళ్లు సుప్రసిద్ధులు !

వర్షా భావంతో
అన్నదాతలు
కన్నీరుపెడుతున్నారు!
వేటగాళ్లకు పట్టదు!

ఇంటా బైటా వీళ్లు
పీక్కతినే పనిలోనే!
అటు సామ్రాజ్య వాదం
భారత్ లో మనువాదం!

వామపక్ష ఐక్యతే
ప్రపంచాన్ని కాపడేది!
కదలండి కామ్రేడ్స్
ఐక్య నినాదంతో!

ప్రపంచ నిర్మాణానికి!
ప్రజలుసిద్ధమయ్యారు !
వాళ్ళే చూసుకుంటారు!
ప్రజలే చరిత్రనిర్మాతలు!

— తమ్మినేని అక్కిరాజు, హైదరాబాద్

# తాతా మధు వ్యాఖ్యలపై రామడుగు కాంగ్రెస్ ఆగ్రహం

- **దిష్టిబొమ్మల దహనం.. పోలీసులకు ఫిర్యాదు**
- **స్పీకర్ పదవి ప్రతిష్ఠను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ నిరసన**



**రామడుగు, సెప్టెంబర్8(తెలంగాణ ముచ్చట్లు):**తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. స్పీకర్ పదవి ప్రతిష్ఠను, శాసనసభ గౌరవాన్ని కించపరిచేలా తాతా మధు వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.

ఈ సందర్భంగా తాతా మధుతో పాటు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం తాతా మధు వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ రామడుగు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాజుకు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కోల రమేష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్, కడే శంకర్, యూత్ కాంగ్రెస్ రామడుగు మండల అధ్యక్షుడు అనుపురం పరుశురాంగౌడ్, సర్పంచులు గుమ్మడి మల్లేష్, మొయిజ్, మనీష్, బాలగౌడ్, బద్దం లక్ష్మారెడ్డి, ఎలుకపెల్లి లచ్చయ్య, జక్కుల బాబు, శేఖర్, కత్తి మధు, ఈశ్వర్, భువన్‌గౌడ్, స్వామి, దిలీప్, అనిల్, శీను, రాజు, రాజేందర్, జబ్బర్, కనకయ్య, రామ్‌రెడ్డి, మాధవరెడ్డి, ఎల్లయ్య, తడగొండ లక్ష్మణ్, హనుమంతు, నర్సింగ్‌బాబు, మల్లేశం, రవి, పోచయ్య, వెంకటేష్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ, సింగిల్ విండో పాలకవర్గాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

- **ధరావత్ రాజుకు అభినందనలు తెలిపిన బీఆర్ఎస్వీ నాయకులు**



**స్టేషన్‌ఘన్‌పూర్,సెప్టెంబర్8(తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న హిందీ ఉపాధ్యాయుడు ధరావత్ రాజుకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడంతో ఆయనను బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్న ధరావత్ రాజును పాఠశాల ఆవరణలో శాలువాతో సత్కరించి, పూలబొకే అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా లకావత్ చిరంజీవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా, సేవగా భావిస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం ధరావత్ రాజు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయనకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఆయన చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మంచి ఉపాధ్యాయుడి బోధన తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతుందని అన్నారు. ధరావత్ రాజుకు లభించిన పురస్కారం భవిష్యత్తులో మరింత అంకితభావంతో సేవలందించేందుకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. ఆయన సేవలు ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బైరీ సురేందర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు బి.వాసు, ముదిరాజ్ యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంటాల యాదగిరి, విద్యార్థి నాయకులు గుండె రంజిత్, బానోత్ తిరుపతి, రమేష్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నిరసన

- **పోలీసులపై చర్యలకు డిమాండ్**



**హుజూరాబాద్, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు ):** బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో మాజీ మంత్రులు, మహిళా నాయకులు, కార్యకర్తల పట్ల పోలీసులు అసభ్యకరంగా, దురుసుగా వ్యవహరించారని ఆరోపిస్తూ హుజూరాబాద్‌లో బీఆర్ఎస్ మహిళా నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జమ్మికుంట మాజీ కౌన్సిలర్ పొనగంటి విజయ మల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తున్న నాయకులు, మహిళా కార్యకర్తల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థను ప్రభుత్వం తన చేతిలో కీలుబొమ్మగా మార్చుకుందని ఆమె ఆరోపించారు. మహిళా నాయకులు, కార్యకర్తల పట్ల అనుచితంగా ప్రవర్తించిన పోలీసు అధికారులపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ చేపట్టే ప్రజాస్వామ్య ఉద్యమాలను అణచివేయడం ద్వారా ప్రజల గొంతును నొక్కలేరని విజయ మల్లయ్య అన్నారు. ప్రజల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ మహా ధర్నాను విజయవంతం చేయాలి

- **టాప్రా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ పిలుపు**



**హుజూరాబాద్,సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు ):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహా ధర్నాను విజయవంతం చేయాలని టాప్రా కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ పిలుపునిచ్చారు. టీజీఈ జేఏసీ పిలుపు మేరకు హుజూరాబాద్ పట్టణంలోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో టాప్రా హుజూరాబాద్ యూనిట్ అధ్యక్షుడు భారత ప్రభాకర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చందుపట్ల జనార్ధన్, టాప్రా గౌరవాధ్యక్షుడు కట్ట నాగభూషణచారి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన పీఆర్సీని జూలై 2023 నుంచి అమలు చేయాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షనర్ల పెండింగ్ బిల్లులను మంజూరు చేయడంతో పాటు నూతన ఈహెచ్ఎస్ విధానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

తమ సమస్యల పరిష్కారం కోసం గత నెల 27న అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఈ నెల 10న హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించనున్న మహా ధర్నాకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.


ఈ సమావేశంలో టాప్రా హుజూరాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి, టి. కనుకయ్య, బి. వెంకటయ్య, డి. హరికిషన్, ఎం. మొగిలయ్య, సీహెచ్. మల్లారెడ్డి, జి. సాంబయ్య, జి. బుచ్చిరాజం, శబ్ద ప్రకాష్, రవీందర్‌రెడ్డి, జి. గంగయ్య, జి. స్వామిరెడ్డి, యు. రాజేశం, ఎన్. రాజిరెడ్డి, సీహెచ్. సమ్మిరెడ్డి, సురేష్‌బాబు, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాల పరిశీలన వేగవంతం

- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏఏఐ సాంకేతిక బృందం క్షేత్రస్థాయి అధ్యయనం**

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించి ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) సాంకేతిక బృందం గత రెండు రోజులుగా జిల్లాలో గుర్తించిన ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహిస్తోంది. మంగళవారం ములకలపల్లి మండలం తిమ్మంపేటలో కొనసాగిన పరిశీలనలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ ఏఏఐ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. భవిష్యత్తులో జిల్లాకు వైమానిక అనుసంధానం కల్పించే లక్ష్యంతో ప్రతిపాదించిన విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలమైన ప్రాంతాన్ని గుర్తించేందుకు అధికారులు అన్ని కోణాల్లో అధ్యయనం చేపడుతున్నారు. విమానాశ్రయ స్థాపన కోసం సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం ప్రాంతాలు, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచదమ్మపేట ప్రాంతాలు, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను ప్రతిపాదిత స్థలాలుగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో భూమి స్వభావం, ఎత్తుపల్లాలు, కొండలు, అటవీ ప్రాంతాలు, నీటి ప్రవాహ మార్గాలు, రహదారులు, రైల్వే మార్గాలు, విద్యుత్ లైన్లు, విమానాల రాకపోకలకు అవసరమైన రన్‌వే, అప్రోచ్ జోన్‌ల అనుకూలత వంటి అంశాలను ఏఏఐ బృందం పరిశీలిస్తోంది. ప్రతి ప్రాంతం భౌగోళికంగా ఎంత మేరకు అనువుగా ఉంటుందనే దానిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో మ్యాప్‌ల ఆధారంగా సుమారు 500 ఎకరాల భూమిని ప్రాథమికంగా గుర్తించిన అధికారులు ఇప్పుడు క్షేత్రస్థాయిలో మరింత లోతైన అధ్యయనం నిర్వహిస్తున్నారు. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన రన్‌వే, టెర్మినల్ భవనాలు, కార్గో సదుపాయాలు, భద్రతా మండలాలు, పార్కింగ్ ప్రాంతాలు వంటి మౌలిక సదుపాయాల కోసం అదనపు భూమి అవసరమయ్యే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా విమానాల ల్యాండింగ్, టేకాఫ్ కార్యకలాపాలకు అవసరమైన అప్రోచ్ ప్రాంతానికి సుమారు 1.5 కిలోమీటర్ల వరకు అదనపు ఖాళీ స్థలం అవసరమయ్యే అంశాన్ని అధికారులు పరిశోధిస్తున్నారు. కొన్ని ప్రతిపాదిత ప్రాంతాలకు సమీపంలో ఉన్న సత్తుపల్లి గూడ్స్ రైల్వే లైన్ విమానాశ్రయ నిర్మాణంపై చూపే ప్రభావాన్ని ఏఏఐ నిపుణులు ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్నారు. రైల్వే విద్యుదీకరణ వ్యవస్థ వల్ల కమ్యూనికేషన్, నావిగేషన్ పరికరాలపై విద్యుదయస్కాంత ప్రభావం ఉంటుందా, విమానాల రాకపోకలకు ఆటంకాలు తలెత్తే అవకాశం ఉందా అనే అంశాలను సాంకేతికంగా పరిశీలిస్తున్నారు. అలాగే రన్‌వే దిశ, అప్రోచ్ మార్గం, భద్రతా ప్రమాణాలు, అవసరమయ్యే రైల్వే అనుమతులు తదితర అంశాలను కూడా సమగ్రంగా విశ్లేషిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# కౌశిక్ రెడ్డి రాజీనామాకు సిద్ధమా?

- **హుజూరాబాద్‌లో రాజీనామా చేసి గెలువుకౌశిక్‌కు ప్రణవ్ సవాల్**

**హుజూరాబాద్, సెప్టెంబర్ 8(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి రాజీనామా చేసి తిరిగి పోటీ చేసి గెలవాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సవాల్ విసిరారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

అసెంబ్లీ ప్రజాస్వామ్యానికి దేవాలయమని, అలాంటి సభలో స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ప్రణవ్ అన్నారు. దళిత స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆయన భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో స్పీకర్ కన్నీరు పెట్టుకోవడం బాధ కలిగించిందన్నారు.

అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు ఆందోళన నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.

**దళిత బంధు ఆపింది కౌశిక్ రెడ్డే**

దళిత బంధు పథకం విషయంలో కౌశిక్ రెడ్డి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ప్రణవ్ అన్నారు. దళిత బంధు లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిధులు వారి ఖాతాల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో దళితుల ఓట్ల కోసం కౌశిక్ రెడ్డి కపట ప్రేమ చూపించారని విమర్శించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళిత బంధు నిధుల విడుదలకు చర్యలు తీసుకున్నామని, లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా సోషల్ మీడియా రీల్స్‌కే ప్రాధాన్యత ఇస్తున్నారని కౌశిక్ రెడ్డిపై విమర్శలు చేశారు.

**మహిళలకు కాంగ్రెస్ గౌరవం**

మహిళలకు సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని ప్రణవ్ అన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. స్పీకర్‌పై జరిగిన అనుచిత వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే విచారణకు ఆదేశించిందని తెలిపారు.

కౌశిక్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పోల్చుకునే స్థాయిలో లేరని, ఆయన వ్యవహారశైలిని హుజూరాబాద్ ప్రజలు గమనిస్తున్నారని ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో కౌశిక్ రెడ్డి రాజకీయ జీవితానికి పాడే కట్టే రోజు ముందుందని వ్యాఖ్యానించారు.

**1000 రోజుల్లో సంక్షేమం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ప్రణవ్ తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డుల్లో అదనపు సభ్యుల నమోదు వంటి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.

నియోజకవర్గంలో సుమారు 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, 31,158 మంది రైతులకు రూ.243 కోట్లతో రూ.2 లక్షల లోపు రుణమాఫీ చేశామని తెలిపారు. రైతు భరోసా ద్వారా 73 వేల మంది రైతులకు రూ.71 కోట్ల నిధులు అందించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ప్రణవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అస్వస్థతకు గురైన అధికారికి సీపీఆర్ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

- **అకస్మాత్తుగా కుప్పకూలిన నవీన్ మిట్టల్ పీఎస్ రాజు**
- **వెంటనే స్పందించిన మంత్రి శ్రీహరి**
- **సీపీఆర్ చేసి ప్రథమ చికిత్స అందజేత**
- **ఆసుపత్రికి తరలించిన వైద్య సిబ్బంది**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మంగళవారం అకస్మాత్తుగా అస్వస్థతకు గురైన ఓ అధికారికి మంత్రి వాకిటి శ్రీహరి తక్షణ సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. నవీన్ మిట్టల్ వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్) రాజు ఒక్కసారిగా కుప్పకూలడంతో అక్కడున్నవారిలో ఆందోళన నెలకొంది. పరిస్థితిని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే స్పందించి రాజు వద్దకు చేరుకున్నారు. వైద్య సిబ్బంది వచ్చేలోపే ప్రాథమిక చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టారు. అత్యవసర పరిస్థితిని అంచనా వేసి సీపీఆర్ నిర్వహించారు.

మంత్రి అందించిన సకాల సహాయంతో బాధితుడి పరిస్థితిని స్థిరీకరించేందుకు ప్రయత్నించారు. అనంతరం వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం అందించి అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న వైద్య సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని రాజుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తదుపరి చికిత్స కోసం అంబులెన్సులో సమీప ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనతో అసెంబ్లీ ఆవరణలో కొద్దిసేపు ఆందోళన వాతావరణం నెలకొంది. అయితే మంత్రి, వైద్య సిబ్బంది తక్షణ స్పందనతో బాధితుడికి వెంటనే వైద్య సహాయం అందింది. రాజు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇళ్ల సొమ్ముపై 'హోల్డ్' పంజా!

- **దత్తత గ్రామాల్లో బ్యాంకుల అతి ఉత్సాహమా?**
- **సంఘ బకాయిల పేరుతో ఇళ్ల నిధుల నిలిపివేతపై లబ్ధిదారుల ఆగ్రహం**
- **ఇందిరమ్మ లబ్ధిదారుల అగచాట్లు — "మా ఇంటి డబ్బును మాకు ఇవ్వకుండా అడ్డుకోవడమేంటి?"**

**స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 8 (తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకున్న బ్యాంకులు, ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో లబ్ధిదారులకు అండగా నిలవాల్సి ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఖాతాలను హోల్డ్‌లో పెట్టే విషయంలో మాత్రం బ్యాంకు సిబ్బంది అతి ఉత్సాహం చూపిస్తున్నారంటూ లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండలంలోని కొన్ని గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన విషయం తెలిసిందే. అయితే ఆయా గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమకు మంజూరైన నిధులను అవసరమైన సమయంలో వినియోగించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గ్రామాలను దత్తత తీసుకున్న బ్యాంకులు, అక్కడి సిబ్బంది ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు సహకరించాల్సి ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల కోసం జమ అయిన నిధులు ఉన్న ఖాతాలను హోల్డ్‌లో పెట్టడం పట్ల బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**"సంఘం డబ్బులకు... మా ఇంటి డబ్బుకు సంబంధం ఏమిటి?"**

మహిళా సంఘాల నెలవారీ చెల్లింపులు చేయలేదనే కారణంతో సంబంధిత సీఏలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను హోల్డ్‌లో పెట్టిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

"మహిళా సంఘం బకాయిలు ఉంటే వాటిని నిబంధనల ప్రకారం వసూలు చేసుకోవాలి. కానీ ప్రభుత్వం మా ఇల్లు కట్టుకోవడానికి విడుదల చేసిన డబ్బును ఎందుకు నిలిపివేయాలి?" అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు.

ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేస్తున్న సమయంలో ఖాతాలు హోల్డ్‌లో ఉండటంతో ఆ డబ్బును వినియోగించుకోలేక నిర్మాణ పనులు కూడా ప్రభావితమవుతున్నాయని వారు చెబుతున్నారు.

**ప్రభుత్వ పథకానికి బ్యాంకుల సహకారం కావాలా... అడ్డంకులా?**

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంటే, ఆ నిధులు లబ్ధిదారులకు సకాలంలో అందేలా బ్యాంకులు సహకరించాల్సిన అవసరం ఉందని బాధితులు పేర్కొంటున్నారు.

దత్తత గ్రామాల్లో ప్రభుత్వ పథకాల అమలును వేగవంతం చేయాల్సిన బ్యాంకు సిబ్బంది, లబ్ధిదారుల ఖాతాలపై ఆంక్షలు విధించే విషయంలో ఎందుకు ఇంత ఉత్సాహం చూపుతున్నారో ఉన్నతాధికారులు సమాధానం చెప్పాలని వారు కోరుతున్నారు.

**ఖాతాలు హోల్డ్‌లో పెట్టడంపై సమగ్ర విచారణ జరపాలి**

ఇందిరమ్మ ఇళ్ల నిధులు ఏ కారణంతో హోల్డ్‌లో పెట్టబడ్డాయి? ఎవరి ఆదేశాల మేరకు ఖాతాలపై ఆంక్షలు విధించారు? ఇందుకు సంబంధించిన నిబంధనలు ఏమిటి? అనే అంశాలపై జిల్లా ఉన్నతాధికారులు, బ్యాంకు ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. "ప్రభుత్వం ఇల్లు కట్టుకోమని డబ్బులు ఇస్తుంటే... ఆ డబ్బు మాకు అందకుండా చేయడం ఎందుకు?" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

గ్రామీణ ప్రాంతాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా అధికారులు, సంబంధిత బ్యాంకు ఉన్నతాధికారులు వెంటనే చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు వారి ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన నిధులు సకాలంలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలి: గవర్నర్‌కు బీజేపీ వినతి

- **గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించిన ఎన్. రామచంద్రరావు**
- **40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన**
- **రూ.15 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**
- **విద్యా వ్యవస్థ సంక్షోభంలో ఉందని ఆరోపణ**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని రామచంద్రరావు తెలిపారు. ఈ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.15 వేల కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ కారణంగా అనేక విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కొన్ని కళాశాలలు సగం జీతాలతోనే సిబ్బందిని కొనసాగిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రామచంద్రరావు విమర్శించారు. ఈ అంశంపై బీజేపీ ఆందోళన వ్యక్తం చేసినప్పుడు ప్రభుత్వం స్పందించకుండా నిరసనలను అణచివేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలను ప్రస్తావించిన వారిపై చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య పరిష్కారం కాకపోతే విద్యా వ్యవస్థ మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, కళాశాలలు, ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యను కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని అన్నారు. గవర్నర్‌కు సమర్పించిన వినతిపత్రంలో విద్యార్థుల సమస్యలను వివరించినట్లు బీజేపీ నేతలు తెలిపారు. రాష్ట్రంలోని విద్యా రంగ పరిస్థితులపై గవర్నర్ జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని స్పందించేలా చూడాలని కోరినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తాతా మధును వెంటనే బర్తరఫ్ చేయాలి: మహిళా కాంగ్రెస్ డిమాండ్

- **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన**
- **అంబేద్కర్ విగ్రహం వద్ద తాతా మధు దిష్టిబొమ్మ దహనం**
- **బహిరంగ క్షమాపణ చెప్పాలని మహిళా కాంగ్రెస్ డిమాండ్**






**హైదరాబాద్, సెప్టెంబర్ 8, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాఖ్యలను ఖండిస్తూ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నాయకత్వం వహించారు. ఖైరతాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాళ్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పెద్ద సంఖ్యలో మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్పీకర్ పదవికి గౌరవం కల్పించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నేతలు తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా వ్యవహరించాల్సిన వ్యక్తి శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా మాట్లాడటం దురదృష్టకరమని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థకు ప్రతీకగా నిలిచే స్పీకర్ పదవిని కించపరిచే ప్రయత్నాలను ప్రజలు సహించరని హెచ్చరించారు. ప్రజాప్రతినిధుల ప్రవర్తన ప్రజలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై జరిగిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత దూషణలు మాత్రమే కాకుండా రాజ్యాంగ వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామని అన్నారు. ఈ ఘటన మహిళల పట్ల, దళితుల పట్ల బీఆర్ఎస్ నాయకత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రతిబింబిస్తోందని ఆరోపించారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను లక్ష్యంగా చేసుకుని అవమానకర వ్యాఖ్యలు చేయడం అత్యంత ఖండనీయమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి రాజ్యాంగ పదవికి గౌరవం ఉండాలని, ఆ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని అన్నారు.

తాతా మధును వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని మహిళా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అలాగే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరింది. ప్రజా జీవితంలో ఉన్నవారు మాటల విషయంలో సంయమనం పాటించాలని, సమాజంలో విభేదాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడకూడదని సూచించింది. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయాలంటే రాజకీయ నాయకులు పరస్పర గౌరవాన్ని పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొంది.

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు రాష్ట్ర రాజకీయాల్లో మర్యాదపూర్వక సంభాషణలు కొనసాగాలని అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత విమర్శలు, అవమానకర వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి మేలు చేయవని అన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగడం బాధాకరమని పేర్కొన్నారు. స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ రేఖ బోయలపల్లి, ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషాశ్రీ, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు కవిత, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. నిరసన అనంతరం తాతా మధుపై పార్టీ మరియు శాసనపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. స్పీకర్ పదవికి గౌరవం కల్పించాలన్న నినాదాలతో కార్యక్రమం ముగిసింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in